# పరమానందయ్యగారి ఆత్మ పరవశించింది



పరమానందయ్యగారు ఆయవారం కోసం శిష్యులను ఊరిలోకి పంపారు.

ఆరోజుల్లో బ్రాహ్మణుడు ఉద్యోగాలు చేసే యోగ్యత కాని, రాజ్యాధికారానికి అర్హతకాని ఉండేవి కావు. ధనం సంపాదించకూడదని, ఆస్తిపాస్తులు సమకూర్చుకోకూడదని నిషేధం ఉండేది.

మరి... వారు బ్రతకడం ఎలా?

అందువల్ల బ్రాహ్మణులకి కొన్ని విధులు, అందుకు కొన్ని ప్రతిఫలాలు ఏర్పరచారు.

ఆ విధులలో ముఖ్యమైనది... పురోహితులుగా ఉండడం! అంటే... పౌరుల మంచిని కోరుతూ, వారి క్షేమానికి అవసరమైన కార్యాలు చేయడం. వారు మహారాజులకు తగిన సలహాలు ఇస్తూ రాజతంత్రం నెరపి సత్పరిపాలనకు తోడ్పడవచ్చు. రాజనీతిని, యుద్ధతంత్రాన్ని ప్రదర్శించవచ్చు. ఇందుకు ప్రతిఫలంగా వారు కేవలం కనీసావసరాలకే సరిపడే మొత్తాన్ని స్వీకరించాలి. ఆస్తిపాస్తులు సంపాదించకూడదు. ఆ అవకాశం ఉంటే వారిలో స్వార్థం పెరిగి ప్రజాక్షేమం మరిచి అకృత్యాలకు పాల్పడగలరు.

బ్రాహ్మణులు నిర్వహించగల మరో విధి... గురుకులాలు స్థాపించి విద్యాబోధన చేయవచ్చు. కాని అందుకు ఏ విధమైన పారితోషికం, ప్రతిఫలం స్వీకరించకూడదు. తీసుకుంటే విద్యను అమ్ముకున్నట్లవుతుంది. అది మహా పాపం.

ఇటువంటి పరిస్థితులలో వారు జీవించేదెలా?

అందుకుగాను పాలకులు వారి అవసరాలకు సరిపడే గోవులను, ధాన్యాలను, శాకాలను ఇచ్చేవారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా యథాశక్తి పాలు, పెరుగు, కూరలు, పప్పులు ఇచ్చేవారు. ఇంక సామాన్య బ్రాహ్మణులు బిక్షాటనతో జీవించేవారు. పూజలు, పురస్కారాలు, పెళ్ళిళ్ళు, శ్రాద్ధ కర్మలు చేయిస్తూ, స్వయంపాకాలతో సంభావనలతో బ్రతికేవారు. ఇటువంటి కఠోర నియమాల మధ్య నిస్వార్థ జీవితం గడుపుతుండేవారు.

ప్రభువుల అండదండలు లేని, గురుకులాలు ఏర్పరచుకోలేని గురువులు తమ ఇంట్లోనే శిష్యులకు విద్యాబోధన చేస్తుండేవారు. శిష్యులను ఇంట్లోనే ఉంచుకొని అన్నపానీయాలిస్తూ కన్నబిడ్డల్లా చూసుకునేవారు. వీరందరి భోజనావసరాల కోసం గురువులు తమ శిష్యులను ఆయవారాల కోసం పంపేవారు. అంటే... నిర్ణీత దినాలలో నిర్ణీత ప్రజల ఇళ్ళకు వెళ్ళి బిక్షాటన చేసేవారు. బ్రాహ్మణులు సమాజ శ్రేయోదాయకమైన కార్యాలు చేస్తుండడం వల్ల పౌరులు వారి బాధ్యతను స్వీకరించేవారు.

ఈ ఒరవడిలో పరమానందయ్యాగారి శిష్యులు ఆయవారానికి బయలుదేరారు. అయితే... దురదృష్టవశాత్తూ వారందరూ మూర్ఖ శిఖామణులు, అమాయక చక్రవర్తులూను.

ఆయవారానికి వెళ్ళి తిరిగి వస్తూన్న శిష్యుల కంట ఒక సూది పడింది.

దానిని తీసుకుని భద్రంగా గురువుగారికి ఇయ్యాలనుకున్నారు.

మరి.., దాన్ని ఎవరు తీసుకువెళ్ళాలి? ఎవరు తీసుకువెళ్ళినా వాడు మిగిలినవాడికంటే ముఖ్యుడైపోడూ? అందువల్ల ఆ భారాన్ని సమంగా పంచుకోవడం కోసం ఆ సూదిని ఒక వెదురుబొంగుకి గుచ్చి ఆ బొంగుని అందరూ సమిష్టిగా భుజాల మీద పెట్టుకుని మోస్తూ వెళ్ళసాగారు.

ఆ సమయానికి ఆ ఊరిలో సుప్రసిద్ధురాలైన ఒక వేశ్యాంగన మేనాలో అటు వెళ్తోంది. వెదురుబొంగుని మోస్తున్న శిష్యగణాన్ని చూసేసరికి ఆమెకి నవ్వు వచ్చింది. వారి వంక చూసి ఒక చిరునవ్వు విసిరింది.

అంతే... ఆ శిష్యులందరికీ ఒక మెరుపుదెబ్బ తగిలినట్లయింది. ఆనందంతో వారి మనసులు ఉబ్బితబ్బిబ్బయిపోయాయి.

అయితే... ఆమె ఎవరి వంక చూసి నవ్విందో అర్థంకాలేదు. ప్రతివాడూ 'తనని చూసి నవ్విందంటే, తనని చూసి నవ్విం'దని చెప్పసాగాడు.

ఆ విషయం తేల్చుకోవడానికి ఆమె దగ్గరికి వెళ్లి, "మీరు మాలో ఎవర్ని చూసి నవ్వారు?" అని అడిగారు.

ఆమె మరో నవ్వు విసిరి "మీలో పరమ మూర్ఖుడు ఎవరో వానిని చూసి నవ్వాను" అని చెప్పి ముందుకి సాగిపోయింది.

వెంటనే పరమానందయ్యగారి శిష్యులు- 'నేనంటే, నేనే మూర్ఖుడి'నని వారిలో వారు కలహించుకోసాగారు.

చివరకు అందరూ కలిసి పరమానందయ్యగారి దగ్గరకు వెళ్లారు. తమకు దొరికిన సూదిని భక్తితో ఆయన పాదాల చెంత ఉంచారు. ఆ తర్వాత వేశ్యాంగన వృత్తాంతం చెప్పి,

"గురువర్యా..! మాలో పరమ మూర్ఖుడు ఎవరో తెలియజెప్పండి?" అన్నారు.

పరమానందయ్యగారు శిష్యుల అమాయకత్వాన్ని చూసి బాధపడి-

"ఓరి దౌర్భాగ్యుల్లారా... మీరు శాపగ్రస్థులురా! ఈ ప్రశ్నకు సమాధానం మీకు ఇప్పుడు దొరకదు. ముందు జన్మలో మీరందరూ ఇదే ప్రశ్న వేసుకుంటారు. సమాధానం అప్పటి పాలకులు చెప్తారు. మీలో అతితక్కువ స్థాయిలోనివారికి ఆయవారాల మీద బ్రతకవలసిన స్థితి కలుగుతుంది. అందర్నీ ఒకే స్థాయికి తెచ్చి సర్వ సమానత్వం సాధించడం జరుగుతుంది" అని దివ్యదృష్టితో చూసి చెప్పారు.

* * *

నాలుగు వందల సంవత్సరాలు గడిచిపోయాయి.

భారతదేశ చరిత్రలో ఎన్నెన్నో పరిణామాలు సంభవించాయి.

కాకతీయ సామ్రాజ్యం, విజయనగర సామ్రాజ్యం వంటివి స్వర్ణయుగాలుగా పేరొంది అంతరించాయి. మొఘలాయి సామ్రాజ్యం నిరంకుశంగా పాలించి మట్టికరిచింది. రవి అస్తమించని మహా సామ్రాజ్యం అని పేర్గాంచిన బ్రిటిష్ సామ్రాజ్యం పెట్టే, బేడా సర్దుకొని వెళ్లిపోయింది. దేశానికి 1947 ఆగస్టు 15వ తారీఖున స్వాతంత్ర్యం సిద్ధించింది.

స్వాతంత్ర్య సమరాన్ని నడిపిన మహాత్మాగాంధి- సమాజంలో అట్టడుగున ఉండి అంటరానివారుగా ముద్రపడి అష్టకష్టాలు పడుతున్న బడుగు ప్రజలను ఉద్ధరించడానికి నడుంకట్టాడు. వారికి 'హరిజనులు' అని పేరు పెట్టాడు. వీరిలాగే 'ఆదివాసులు, గిరిజనులు' వంటివారు కూడా ఎన్నో అవమానాలకి, బాధలకు గురి అవుతున్నారు.

1950వ సంవత్సరం జనవరి 26న భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా రూపొందింది. ఈలోగా స్వాతంత్ర్యం వచ్చి అర్ధ సంవత్సరమైనా కాకముందే, తాను కలలు కన్న సమసమాజాన్ని చూడకముందే హత్యకు గురియై అసువులు బాశాడు గాంధీజీ.

ఆయన గతించినా ఆయన ఆశయాలను చిత్తశుద్ధితో అమలు జరపాలనుకున్నారు దేశ పాలకులు. ఇందులో భాగంగా బడుగు వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాలలో, విద్యా సంస్థలలో, చట్టసభలలో ప్రత్యేక కోటాను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

'రిజర్వేషన్‌లు' అనబడే ఈ కేటాయింపులు పది సంవత్సరాలపాటుంటే చాలు- అట్టడుగు వర్గాలన్నీ పాలమీద మీగడలాగా అభివృద్ధి పథంలో పైకి వచ్చేస్తాయని, అందరూ ఒకే స్థాయిలో ఉండి సమసమాజ స్థాపన జరుగుతుందని గాఢంగా విశ్వసించారు. అగ్రవర్ణాలుగా చక్రాంతికాలు, ముద్రాంకితాలు పడ్డవారు కూడా "అయ్యో... మన తాత, ముత్తాతలు ఈ వర్గాలను నానా బాధలు పెట్టారు. ఈ చర్యతో ఆ పాపానికి పరిహారం అవుతోంది. నవసమాజం ఏర్పడుతోంది" అని భావించి మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారు.

పది సంవత్సరాలు గడిచిపోయాయి.

బడుగు వర్గాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్నట్లుగా ఉండిపోయింది. ఈ పరిస్థితిలో ప్రత్యేక కేటాయింపులు మరో పది సంవత్సరాలు పొడిగించారు.

'మేధావులు' అని అనిపించుకునే కొందరు- "ఇలా పొడిగించుకుంటూ పోవడం వల్ల ప్రయోజనం లేదు. వారు పైకి రావాలంటే ముఖ్యంగా చేయవలసింది... వారిని విద్యావంతులుగా చేయడం!" అని చెవికింద ఒకటే రొద పెట్టసాగారు.

పాలకులలో పెద్దలు, ప్రముఖులు రహస్య సమావేశాలు, మంతనాలు జరపసాగారు. "నిజంగా ఈ అట్టడుగు వర్గాలవారిని విద్యావంతులుగా చేస్తే కొంపలు అంటుకుపోతాయి. ఇప్పుడైతే తాము చెప్పినట్లు చేస్తున్నారు. తమకే ఓట్లు వేస్తున్నారు. తమ అధికారం ఢోకా లేకుండా సాగిపోతోంది. వాళ్ళు విద్యావంతులైతే సొంతంగా ఆలోచిస్తారు. సక్రమ పరిపాలనను అందించగలదనుకున్న పార్టీకే ఓట్లు వేస్తారు. అదే జరిగితే తమ అధికార పీఠం దద్దరిల్లుతుంది!"... ఈ ఆలోచన రాగానే వారి గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

మరి... మేధావులు గోల చేయకుండా వారిని జోలపాడి పడుకోపెట్టడం ఎలా?

"పీడిత, తాడిత, బడుగువర్గాల వారినందర్నీ అక్షరాస్యులను చేసేస్తాం!" అని ప్రకటించారు.

"అక్షరాస్యతా ఉద్యమాన్ని ముమ్మరం చేస్తాం..!" అన్నారు.

"విద్యయే వెలుగు. అక్షరాలు నేర్వండి... సంతకాలు చేయండి!" వంటి నినాదాలను గోడల మీద రాయించారు.

పత్రికల్లో ప్రకటనలు గుప్పించారు.

"అందరికీ చదువు" అంటూ ఊరేగింపులూ, ర్యాలీలూ, జాతరలూ నిర్వహించారు.

వేషాలు వేయించి నాటకాలు వేయించారు.

నటవరులు, కళాకారులు తమ బత్తేలు పుచ్చుకొని వెళ్లిపోయారు. బడుగు గొంగళి మాత్రం వేసిన చోటనే ఉంది.

రాత్రి పాఠశాలలు తెరిచారు.., "వయోజన విద్య" అన్నారు. నానా హడావుడీ చేశారు. వీటి ధర్మమా... అని ఎందరో బాగుపడ్డారు. నాలుగు రాళ్లు వెనకేసుకున్నారు.

పథకాలన్నీ పేపర్లకే పరిమితం అయ్యేట్లు, ఆచరణలో అతి తక్కువగా ఉండేటట్లు జాగ్రత్త పడ్డారు పాలకులు. అర్థగణాంక శాఖ వారిని అర్థించీ, ఆదేశించీ అక్షరాస్యుల సంఖ్యను వామన రూపంగా విస్తరింపజేస్తూ అంకెల వర్షాన్ని కురిపించసాగారు.

ఇంతచేసినా నిరక్షరాస్యత మాత్రం... 'నేను ససేమిరా కదలను' అంటూ భీష్మించుకుని బైఠాయింపు సమ్మె చేయసాగింది. కాకపోతే... అట్టడుగు వర్గాలలో కొందరు పైకి, మరికొందరు మరీ పైకి వచ్చారు కాని, వారిలో చాలామంది తమ సాటివారిని, తోటివారిని- తమంత కాకపోయినా కొంచెమైనా పైకి తీసుకురావడానికి ప్రయత్నం చేయలేదు. పైగా... వారితో కలిసి తిరిగితే తామేదో మైలపడిపోతామన్నట్లు తప్పించుకు తిరిగి ధన్యులయ్యారు.

ఇంకా అన్యాయమేమిటంటే తాము ఎంత ఉన్నతంగా ఉన్నా తమ సంతానానికి కూడా అట్టడుగు వర్గాలవారికి లభిస్తున్న రాయితీలు ఉండి తీరాల్సిందేనని పట్టుపట్టారు. వీరందరినీ సంతృప్తి పరచేందుకు కేటాయింపులు, సౌకర్యాలు, రాయితీలు మరో పదేళ్ళు, ఇంకో పదేళ్ళు కాకుండా- శాశ్వతం చేసేస్తామని హామీలు పోటీలుపడి గుప్పించసాగారు నాయకులు.

అదివిని, "ఇదేమిటయ్యా... వారిని శాశ్వతంగా వెనుకబడే ఉండేటట్లు చేస్తారా?" అని అడిగితే- వారిని 'జాతీయ వ్యతిరేకులు, విదేశీ హస్తగ్రహకులూ' అని నిందించసాగారు.

ఇదిలా ఉండగా... ఒకసారి అధికారంలో ఉన్న ప్రభుత్వానికి అంతర్గత తగాదాలవల్ల పతనమయ్యే ప్రమాదం ఏర్పడింది.

ఈ గండం గడవడానికి ప్రధాని 'వీరకేసరి' – దేశంలో వెనుకబడ్డ కులాలు, జాతులు కాకుండా వెనుకబడ్డ వర్గాలు కూడా ఉన్నాయని, వీరికి ముప్పయిశాతం కేటాయింపులు ఇస్తున్నానని మబ్బులేని పిడుగులాగా జనం మీద ఒక బాంబుని వదిలారు.

దాంతో దేశంలో కొన్నివారాలపాటు ఆగని హింస చెలరేగింది. ఎందరో ఆత్మాహుతి చేసుకున్నారు.

ఈలోగా వ్యవహారం న్యాయస్థానానికి వెళ్ళింది.

సర్వోన్నత న్యాయస్థానం– కేటాయింపులు వివిధ వర్గాలకు ఉండవచ్చుననీ, అయితే ఇవి అన్నీ కలిసి యాభై శాతం మించకూడదని తీర్పు ఇచ్చింది. అధికారంలో ఉన్న ప్రభుత్వం బ్రతుకుజీవుడా... అని ఊపిరి పీల్చుకుని, ఈ నిర్ణయాన్ని దేశమంతటా చకచకా అమలు చేయసాగింది.

కొన్ని రాష్ట్రాలవారు– తమ రాష్ట్రంలో వెనుకబడ్డవారు మరీ ఎక్కువగా ఉన్నారని, అందువల్ల కేటాయింపులు యాభై శాతం మించే ఉండాలని డిమాండ్ చేయసాగారు.

కొందరు డెబ్భై, ఇంకొందరు ఎనభై శాతం... ఇలా పెంచేస్తూ రాజ్యాంగాన్ని మార్పించుకోసాగారు.

ఇవన్నీ ఓట్లకోసం పడే పాట్లని కిట్టనివాళ్ళు చెవులు కొరుక్కోసాగారు.

* * *

శాపగ్రస్థులైన పరమానందయ్యగారి శిష్యులు వివిధ వెనుకబడ్డ వర్గాలలో జన్మించారు.

ఎప్పుడైతే కమండలంగారు దారి చూపించారో వివిధ చిల్లర మల్లర ఉప వర్గాలవారు తమకి కూడా వెనుకబడ్డ వర్గాలవారి హోదా ఇయ్యాలని.., ఆ విధంగా రాజ్యాంగపరమైన చక్రాంకితాలు వేయాలని పట్టు పట్టసాగారు.

అదను చూసి ఆర్యావర్తం నుంచి ముని భీముడు ఊడిపడ్డాడు.

"నేను దళిత జనోద్ధరణకు వచ్చిన అవతార పురుషుడిని– కారణజన్ముడిని!" అంటూ దేశం అంతటినీ ప్రభంజనంలాగా చుట్టి రాసాగాడు.

'పాత రోత– కొత్త వింత' అన్నట్లు ముని భీముని వైపు ఎగబడసాగారు జనం.

ఇది చూసేసరికి అధికార పీఠాన్ని అధిష్టించిన పాలకుల గుండెలు బేజారెత్తాయి. స్వజనంలో కొందరు మండూక నృత్యం నేర్చుకుని అటువైపు కప్పగంతులు వేయసాగారు.

అధికార పీఠం క్రింద భూకంపం వస్తున్నట్లు, పీఠం బీటలు వారుతున్నట్లు సంకేతాలు రాసాగాయి. వెంటనే వెనుకబడ్డ వారి మీద ప్రేమామృత వర్షాన్ని జడివానలా కురిపించడ మొక్కటే మార్గం అనిపించింది.

వెంటనే వివిధ కులాల పేర్లతో సదస్సులు ఏర్పాటు చేయసాగారు. కాదు- కాదు... తెరవెనుక నుంచి ఆయా కులాల నాయకుల చేత ఏర్పాటు చేయించసాగారు. ఈ సదస్సుల నాయకులు ఎవరో కాదు- పునర్జన్మ ఎత్తిన అలనాటి పరమానందయ్యగారి శిష్యులే.

ప్రతి సదస్సులోనూ కుల నాయకులు-

'తాము ఇతరులకంటే వెనుకపడ్డ వారమనీ, అందువల్ల తమకు న్యాయమైన కేటాయింపులూ, రాయితీలూ కావా'లని కోరుకోసాగారు.

పాలకులు, వారి ప్రతినిధులు మందహాస (సుందర కాయ)వదనంతో-

"మీరు కోరిన వివరాలే కాదు.., కోరని (స)వరాలు కూడా ఇస్తాం" అంటూ నరంలేని నాలుకతో వాగ్దానాలను బాణాలుగా వదలజొచ్చారు.

ఈ సదస్సు అయిపోగానే మరో కులంవారు తమ సదస్సు పెట్టేవారు. దానిని ఆ కులంలో జన్మించిన మాజీ పరమానందయ్యగారి శిష్యుడు నాయకుడుగా ఉండేవాడు.

పాలకులు ఆయా కులాల సాంప్రదాయాలకు అనుగుణంగా వేషాలు మార్చుకుని, ఉన్న మీసాలు తీసేసి, లేని జుట్టు తగిలించుకుని, తమ భాషను సంస్కరించి ఎప్పటికెయ్యది ప్రస్తుతమో, అప్పటికా విధంగా మెలగసాగారు.

నాయకులు- 'తమ కులం వారు, అంతకుముందు సదస్సు జరిపిన వారికంటే మహా వెనుకబడిన వారనీ, అందువల్ల తమకు ఇంకా ఎక్కువ రాయితీలు కావా'లని కోరుకునేవారు.

ఎప్పటిలా పాలకులు వీరికీ వాగ్దానాలు చేసేవారు.

అటుతర్వాత మరో కులంవారి సదస్సు జరిగేది. దాని నాయకుడు (మరో మాజీ పరమానందయ్యగారి శిష్యుడు) తాము పరమ వెనుకబడ్డవారమని విన్నవించుకునేవాడు.

ఇలా ప్రతి కులంవారూ- 'తాము వెనుకబడ్డవారమనీ, మరీ వెనుకబడ్డవారమనీ, మరీ మరీ వెనుకబడ్డవారమనీ, ఇంకా ఇంకా వెనుకబడ్డవారమనీ, పరమ వెనుకబడ్డవారమనీ, మహా వెనుకబడ్డవారమనీ'... ఇలా తమ వెనుకబడ్డతనపు ఘనతను చాటుకోసాగారు.

పాలకులు రాయితీలను కొండవీటి చాంతాడులాగా అసంఖ్యాకంగా పెంచుకుంటూ పోతున్నారు. అయినా పీఠం కదులుతుందేమోనన్న భయం వారిని వదలలేదు. వెంటనే కొందర్ని పనిగట్టుకు పిల్చి-

"మీరు అల్పసంఖ్యాకులు. మీకు మా అధికసంఖ్యాకులు ఎన్నో అన్యాయాలు చేశారు. వాటిని మేం సరిచేస్తాం- మీకు కావాల్సిన వరాల్ని కోరుకోండి!" అంటూ దువ్వసాగారు.

"అల్పసంఖ్యాకులు, అధికసంఖ్యాకులంటూ వివక్షత ఏమిటి? అందరూ భారతీయులే కదా! అందరికీ సమాన అవకాశాలు, హక్కులు ఉన్నాయి కదా! ఏ విధమైన వివక్షతా లేదు కదా! అల్పసంఖ్యాకులుగా అనబడుతున్నవారు అత్యున్నతమైన రాష్ట్రపతి పదవి కూడా పొందారు కదా..?!" అని అడిగినవారిని 'మతఛాందసులు, మతోన్మాదులు, లౌకిక వ్యతిరేకశక్తులు!' అని దుయ్యబట్టసాగారు.

అడగనిదే వరాలు కురుస్తున్నప్పుడు వద్దనేవారు ఎవరుంటారు? వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ గొంతెమ్మ కోరికలు కోరసాగారు. తమ కోర్కెలు నెరవేర్చుకోడానికి సత్యాగ్రహాలు, ప్రాయోపవేశాలు, నిరసన వ్రతాలూ, ఆమరణ నిరాహార దీక్షలూ వంటివి ప్రారంభించారు. కొందరు 'ఆమరణ ఫలహార దీక్ష' ను చేపట్టాలను తీవ్రంగా యోచించారు.

"ఇదేమిటి? ఎక్కడైనా నిరాహార దీక్షలుంటాయి కాని, ఫలహార దీక్షలు ఏమిటి?" అని అడిగినవారికి-

"ఏం..? మన దేశంలో సమ్మె చేయడం అంటే... పని మానేసి ఉత్పత్తిని స్తంభింప జేయడం! అదే- జపాన్‌లో సమ్మె అంటే జీతాలు తీసుకోకుండా ఉత్పత్తిని రెట్టింపు చేయడం! అదే నమూనాలో మేము ఆమరణ నిరాహార దీక్షకు బదులు ఆమరణ ఫలహార దీక్షను చేపడ్తే తప్పేమిటటా?" అంటూ ఠక్కున సమాధానం చెప్పసాగారు.

"ఇప్పుడు చేస్తోందదేగా! ఇంకా కొత్తగా చేసేదేముంది?" అంటూ అడిగినవారు లోన గొణుక్కుంటూ, పైకి నవ్వుకుంటూ వెళ్లిపోసాగారు. అయితే... ఈ దేశం జపాన్ కాదు కనుక, ఇక్కడ పబ్లిక్‌గా అటువంటి దీక్షలకు అవకాశం లేక యథాశక్తి ఇంట్లోనే లోపాయికారిగా చేస్తూ ఏదో సంసారపక్షంలా సరిపెట్టుకోసాగారు.

దానాదీనా పరమాతిపరమ వెనుకబడ్డవారి సంఖ్య నిరంతరంగా, నిరాటంకంగా పెరిగిపోతుండడంతో, రెండువేల సంవత్సరం వచ్చేసరికి కేటాయింపులు నూరు శాతం చేరుకున్నాయి. ఇంకా పెంచాలని పాలకులు అనుకున్నారు కాని, ఎలా చేయాలో అర్థంకాక, ఆ అంశాన్ని పరిశీలించడానికి ఓ కమిటీని వేసి చేతులు దులుపుకున్నారు.

అగ్ర వర్ణాలుగా ముద్రపడ్డ వారిని- "ప్రభుత్వ కార్యాలయాల్లో, విద్యా సంస్థలలో మీకు ప్రవేశం లేదు. మీ చావు మీరు చావండి. గతంలో మీ పూర్వీకులు చేసిన పాపానికి ఇప్పుడు మీరు శిక్ష అనుభవించండి" అని హుకుం జారీ చేశారు.

"ఇదేమిటి? నువ్వు కాకపోతే మీ తాతగారు ఈ నీళ్ళను తాగాడు- అన్న తోడేలు, మేకపిల్ల కథలాగా ఉందే! ఎప్పుడో, ఎవరో చేసిన నేరానికి ఇప్పుడు మేము శిక్ష అనుభవించడం ఏమిటి? ఇదేం న్యాయం?" అంటున్నా వినే నాథుడు లేక మిన్నకుండిపోయారు.

ఆరోజున కేటాయింపులు నూరు శాతం పూర్తయిన సందర్భంలో విజయోత్సవం జరపాలని నిర్ణయించి, స్వీయ అభినందన సభను రంగరంగవైభవంగా ఏర్పాటుచేశారు. ఆ సభకు ముని భీముడు ముఖ్య అతిథిగా విచ్చేశాడు. వీరకేసరి అధ్యక్షత వహించాడు.

ముని భీముడు- "మిత్రులారా! నేను వెనుకబడ్డవారి సముద్ధరణ కోసమే అవతరించిన విషయం మీకు తెలుసు. ఇప్పటికే ఇంచుమించు ప్రతి ఇంటా అవతార పురుషులు, దేవుళ్ళ పటాల ప్రక్కన నా ఫోటోలు కూడా అలంకరించబడి పూజ లందుకుంటున్నాయన్న విషయం మీకు తెలుసు. నేను వచ్చిన కారణం పూర్తయింది. క్రింది వారిని పైకి తీసుకురాలేకపోయినా, పైవారిని క్రిందికి లాగి సమసమాజ స్థాపన చేశాం-" అని సగర్వంగా ప్రకటిస్తున్నాను అని గంభీరోపన్యాసం చేశారు.

"అందరికీ శుభవార్త!" అంటూ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రవేశించి అధ్యక్షులవారి చేతికి ఒక కాగితాన్ని అందించాడు.

దానిని చదువుతూనే ఆయన ముఖం విప్పారింది.

"మహా జనులారా... ఈ శుభ సందర్భంలో మీ అందరికీ ఒక గొప్ప శుభవార్త. శ్రీమాన్ ముని భీములవారు దానిని మీకు తెలియజేస్తారు" అంటూ కాగితాన్ని ఆయనకి అందించాడు.

ముని భీముడు ఆ కాగితాన్ని చదివి తన్మయత్వంతో "మహా జనులారా! మన దేశ ఖ్యాతి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. మిగిలిన దేశాలు మనదేశం కంటే అభివృద్ధి చెందినా వాటి పేరు ఎక్కలేదు. కాని, మనదేశం ప్రపంచం మొత్తంలో అత్యధికంగా వెనుకబడిన దేశంగా రికార్డులోకి ఎక్కింది" అని మురిసిపోతూ చెప్పాడు.

ఆ మాటలు వింటూనే తన జోస్యం నిజమైనందుకు పరలోకంలోవున్న పరమానందయ్యగారి ఆత్మ పరవశించింది.

*- ఆంధ్రభూమి వార పత్రిక... 10 డిసెంబర్ '98*